ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 16.03.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. SC, ST, BCలతో పాటు మైనార్టీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మూడు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియ రేపు ప్రారంభం కానుంది.
2. రాష్ట్రవ్యాప్తంగా ఈ సెలాఖరు నాటికి ప్రతి నియోజకవర్గంలో మూడు వేల 500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.
3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం జనగాం జిల్లా, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.
4. తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యదాతథంగా కొనసాగించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

.........................................................................

**రాజీవ్ యువ వికాసం**

SC, ST, BCలతో పాటు మైనార్టీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం మూడు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసే రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియ రేపు ప్రారంభం అవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రక్రియను లాంచనంగా ప్రారంభిస్తారు. OBMMS ఆన్లైన్ పోర్టల్లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రుణాలపై 60 నుంచి 80 శాతం వరకు రాయితీ ఇస్తారు. దాదాపు 5 లక్షల మందికి 76వేల కోట్ల

రూపాయల మేర రుణాలను అందిస్తారు. రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభంపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఉదయం హైదరాబాద్ ప్రజా భవన్ లో సమీక్షా నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకం విధి విధానాలపై చర్చించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ ల ఛైర్మన్లు కూడా పాల్గొన్నారు.

(DESK)

**పొంగులేటి**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి ప్రతి నియోజకవర్గంలో మూడు వేల 500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , ఇల్లెందు మండలం లోని పూబెల్లి గ్రామంలో మంజూరైన 83 ఇందిరమ్మ గృహాలకు మంత్రి ఈ ఉదయం భూమి పూజ నిర్వహించారు. ఇల్లెందు పట్టణంలో సుమారు 37 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.

(PTC-BKGM)

**సియం – జగిత్యాల**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం జనగాం జిల్లా, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో పర్యటిస్తారు. శివునిపల్లె గ్రామంలో జరిగే కార్యక్రమంలో 8వందల కోట్ల రూపాయల విలువైన నియోజకవర్గ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. మహిళా స్వయం సహాయ సంఘాల స్టాల్స్ ను సందర్శిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

పిటిసి

**కిషన్ రెడ్డి**

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 22న చెన్నైలో ఏర్పాటు చేస్తున్న సమావేశం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ రోజు హైదరాబాద్ లో విలేఖరులతో మాట్లాడుతూ.... జాతీయ విద్యా విధానం పైన, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన పైన డిఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరి దివాలాకోరుగా ఉందని కిషన్ రెడ్డి విమర్శించారు. డిఎంకే పార్టీ పై తమిళనాడు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుందని, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు హిందీ భాషను, డీలిమిటేషన్ ను తెరపైకి తెచ్చారని కిషన్ రెడ్డి ఆరోపించారు. త్రిభాషా విధానం బ్రిటిష్ కాలం నుంచి వుందని ఆయన గుర్తు చేశారు.

పిటిసి – హైదారాబాద్

**కోమటిరెడ్డి**

నల్లగొండ జిల్లా కనగల్ మండలం లోని ఎఎంఆర్ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే పలు సాగునీటి కాలువలు, చెరువులను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ఉదయం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 850 కోట్ల రూపాయలతో , ప్రధాన కాలువల లైనింగ్ పనులు, మరో 350 కోట్ల రూపాయలతో డిస్ట్రిబ్యూటరీల మరమ్మతు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి, లైనింగ్ కార్యక్రమం 6 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సంవత్సరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లో కంప చెట్లు తొలగించేందుకు తన సొంత నిధుల నుంచి 90 లక్షల రూపాయలు వెచ్చించామని మంత్రి తెలిపారు.

(PTC-NLG)

**వ్యాక్సినేషన్**

ఈ రోజు జాతీయ వ్యాక్సినేషన్ దినోత్సవం. రోగ నిరోధక శక్తి ప్రాముఖ్యత పై అవగాహన పెంచటానికి ప్రతి సంవత్సరం మార్చి 16న జాతీయ వ్యాక్సినేషన్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశంలోని ప్రతి బిడ్డను రక్షించే లక్ష్యాన్ని సాధించటానికి వారిలో రోగ

నిరోధక శక్తి పెంచటం తప్పనిసరి అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందుకోసం 2014 లో ప్రారంభించిన మిషన్ ఇంద్రధనస్సు మంచి ఫలితాలను ఇస్తోందని పేర్కొంది.

యన్ యస్ డి

**బ్రేక్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ''ఎక్స్'' handle @airnews_hyd ను ఫాలో అవ్వండి AIR NEWS Hyderabad Youtube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

**బండి సంజయ్**

పొట్టి శ్రీరాములు పేరిటనున్న తెలుగు విశ్వవిద్యాలయానికి ఆ పేరును తొలగిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం పట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన ఈ రోజు కరీంనగర్ పట్టణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ కు వినతి పత్రం అందజేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ, మహనీయులను అవమానించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. 'ఆనాడు అంబేద్కర్ ను కూడా కాంగ్రెస్ అడుగడుగునా అవమానించిందని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరామలు పేరును యధాతథంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

(PTC-KNR)

**షోకాజ్**

సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలలో ఇంటి పన్నులు, ఆస్తి పన్ను , కుళాయి బిల్లుల వసూల్లో నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్లు, మేనేజర్లు, బిల్ కలెక్టర్లకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ నెలాఖరులోగా 100% ఇంటి పన్నులు, కుళాయి బిల్లులు వసూలు చేయాలని లక్ష్యం విధించగా, ఈ మూడు మున్సిపాలిటీలలో బిల్లుల వసూల్లలో సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

(PTC-SR)

**ఏఆర్ రెహమాన్**

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అస్వస్థతకు గురయ్యారు. చెన్నైలో ఉన్న ఆయనకు ఈ ఉదయం ఛాతీలో నొప్పి తో ఓ ప్రైవేటు ఆస్పత్రి లో చేర్చారు. వైద్యులు ఆయనకు ఈసీజీ, ఈకో కార్డియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. . (DESK)

**నకిలీ పత్తి**

ఆంధ్రప్రదేశ్ నుండి మంచిర్యాల జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలను రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. జిల్లాకు చెందిన ఏడుగురు వ్యక్తులు ఒక బృందంగా ఏర్పడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా పంగుళూరు మండలం చందులూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి తీసుకు వచ్చి, మంచిర్యాల రైల్వే స్టేషన్ లో ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు.

(PTC-MCRL)

**డ్రైవింగ్ కోర్సు**

ఆసిఫాబాద్ జిల్లాలోని వెనుకబడిన తరగతుల యువతీ, యువకులకు డ్రైవింగ్ కోర్సులలో ఉచితంగా శిక్షణ అందించేందుకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి సజీవన్ తెలిపారు. ఆసక్తి ఉన్న వయసు గల యువత ఈ నెల 31 వ తేదీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

**ఎండలు**

రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు ఉదయం పది గంటలు దాటితే బయటకు రావడానికి భయపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా పిప్పల్ ధరిలో నిన్న అత్యధికంగా 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

(DESK)

**కాంగ్రెస్ నిరసన**

అసెంబ్లీ స్పీకర్ పై బి ఆర్ యస్ ఎమ్మెల్యే ల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టిపిసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ రోజు పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు, బి ఆర్ యస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు దగ్ధం చేసారు. స్పీకర్ కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బి ఆర్ యస్ నాయకులను డిమాండ్ చేశారు. జగిత్యాలలో కూడా కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. స్పీకర్ పై బి ఆర్ యస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ నాయకులు సమర్థించటం సరికాదని కాంగ్రెస్ నేతలు అన్నారు.

రాజన్న సిరిసిల్లా జిల్లాలో పలుచోట్ల బి ఆర్ యస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. తిప్పాపూర్ లో జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... స్పీకర్ పై అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన వారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.

పిటిసి- వనపర్తి, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్లా

**చేనేత ఆర్డర్లు**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయాలని టెస్కో చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర రావు సిరిసిల్లాలోని వస్త్ర తయారీదారులను కోరారు. స్కూల్ యూనిఫామ్స్, మహిళా శక్తి చీరలకు తయారీ సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను గడువులోగా పూర్తి చేయాలని ఆయన కోరారు.

పిటిసి

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.